## క్లుప్తంగా

### ప్రత్యేక అలంకరణలో వెంకన్న



వేంకటేశ్వర స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసిమాలలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

### గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న కుమార్‌రాజు

ఎచ్చెర్ల: గ్రంథాలయాల్లో పాఠకులను, ధరావత్తుదారులను పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో వార్షిక తనిఖీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ సెస్సు బకాయిల వసూళ్లపై దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకుడు బి.సూర్యనారాయణ ఉన్నారు.

### బంగారు వర్తకులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తిరుమలరావు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం బంగారం వెండి వర్తక సంఘం ఆధ్వర్యంలో శనివారం పాలకొండ రోడ్డులోని కల్యాణ మండపంలో హెచ్‌యూఐడీ హాల్‌మార్క్‌పై బంగారు వర్తకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నైకు చెందిన జాయింట్ డైరెక్టర్ తిరుమలరావు, మల్లేశ్వరరావులు మాట్లాడుతూ సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో శ్రీకాకుళం నగర బంగారు వర్తక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పేర్ల సాంబమూర్తి, లంక గాంధీ, కోశాధికారి తమ్మన వల్లభ తదితరులు పాల్గొన్నారు.

### నగదు రహిత లావాదేవీలపై శిక్షణ



మాట్లాడుతున్న ధనుంజయరావు

రణస్థలం: గ్రామ సచివాలయాల్లో ఇకపై నగదు రహిత లావాదేవీలు జరపాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.ధనుంజయరావు అన్నారు. మండలంలోని ఉపాధి హామీ పథకం భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ కార్యదర్శులకు నగదు రహిత లావాదేవీలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో నిత్యం జరిగే పనులపై నగదు రహితంగా డిజిటల్ చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఈవోపీఆర్డీ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

### వరి క్షేత్రాల సందర్శన



వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరమని సంతసీతారాంపురం సైకి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష అన్నారు. వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన కొయ్యాంలోని వరిసాగు క్షేత్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. గ్రామం యూనిట్‌గా సాగుకు అనుకూలమైన పంటలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వై.సుధామణి, శ్రావణి, సత్యనారాయణ, రాజ్‌రుషి పాల్గొన్నారు.

### ఇంటర్ తప్పిన విద్యార్థులకు శుభవార్త

రణస్థలం: బ్యాక్‌లాగ్స్, ఇంటర్ తప్పిన విద్యార్థులు మరోసారి పరీక్ష రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని రణస్థలం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సింహాచలం శనివారం తెలిపారు. చదువుకున్న కళాశాలలోనే ఈ నెల 30వ తేదీలోగా ఎలాంటి ఫైన్ లేకుండా పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చునన్నారు.

## వక్రతుండ మహాకాయ..
# కోటిసూర్య సమప్రభ

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం కుంకుమ పూజలు, సాయంత్రం దీపారాధనల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం నిమజ్జనోత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: మంగువారితోటలో నిర్బీజాలతో అర్చనలు



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత



శ్రీకాకుళం కల్చరల్: బొంతావారివీధిలో గణపతి హోమం



శ్రీకాకుళం కల్చరల్: ఏపీహెచ్‌బీ కాలనీలో గరిక పూసలతో అర్చనలు



శ్రీకాకుళం కల్చరల్: మంగువారితోట సంపత్ వినాయక ఆలయంలో గోపూజ



శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్‌కాలనీలో ఇండియన్ ఆర్మీకాలింగ్ ఆధ్వర్యంలో అన్నదానం



శ్రీకాకుళం కల్చరల్: పీఎన్‌కాలనీలోని వినాయక ఆలయంలో లక్షపత్రి పూజలు



గార: యాతవీధిలో అన్నదానం



శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖ స్కూల్‌లో ప్రత్యేక పూజలు



లావేరు: పెద్దలింగాలవలసలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: సిద్ధార్థ అపార్ట్‌మెంట్ వద్ద సత్యనారాయణ వ్రతాలు



జి.సిగడాం: చీడిపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న లంబోధరుడు

## రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం కల్చరల్: రక్తదానం పట్ల యువత అపోహలు వీడి ముందుకు రావాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మేముసైతం పేరిట ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని, నూతనోత్సాహంతో ఉంటారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఆదిత్య కళాశాల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, జామి భీమశంకర్, రెడ్‌క్రాస్ జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, జీవితకాల సభ్యులు చిన్మయరావు, కె.సత్యనారాయణ, సుజాత, పవన్, కళాశాల పీడీ మజ్జి శ్రీనివాసరావు, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ రమణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమావేశంలో సమస్యల ప్రస్తావన



మాట్లాడుతున్న ప్రత్యేక ఆహ్వానితుడు బాలకృష్ణ

లావేరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను ప్రస్తావించారు. విద్యాశాఖలో ఏమి జరుగుతుందో తెలియడం లేదని ఎంఈవో లండ ఈశ్వరరావును మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ ప్రశ్నించారు. పశుబీమా పథకం మండలంలోని ఎంతమంది రైతులకు అందిందో తెలియజేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు పశువైద్యాధికారిణి గాయిత్రిని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు సభ్యులకు వివరించారు. పట్టాలు ఎవరిపేరున ఉంటే వారికి జిరాయితీ హక్కులు కల్పించనున్నట్టు తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి చెప్పారు. సకాలంలో ఎరువులను అందించాలని పలువురు సర్పంచ్‌లు వ్యవసాయ అధికారి మహేష్‌నాయుడును కోరారు. పీఆర్ ఏఈ అప్పన్న మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, నూతన భవనాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని ప్రజాప్రతినిధులను కోరారు.

## ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు భేష్



ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న బీఆర్‌ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ చీఫ్ కోఆర్డినేటర్ అనూరాధ



శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర



ఆకట్టుకున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రదర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యతోపాటు సామాజిక, సాంఘిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములయ్యేందుకు జాతీయ సేవా పథకం ఎంతగానో దోహదపడుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ చీఫ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.అనూరాధ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 పీవోలు డాక్టర్ అర్.శ్రీనివాసరావు పాత్రో, ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యన్నారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1,2,3 పీవోలు ఎస్.మాధవీలత, రుద్రమరాణి, హేమపద్మజ కళాశాలలో చేపడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, టి.ఆదిలక్ష్మి, పి.కనకదుర్గ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేటి గ్రంథం ఆముక్తమాల్యద

శ్రీకాకుళం కల్చరల్: భాషా పాటవాలు కలిగిన మేటి గ్రంథం ఆముక్త మాల్యద అని పార్వతీపురానికి చెందిన తెలుగు పండితుడు సుధాకుమార్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఉపనిషన్మందిరం, మహతి సంయుక్త నిర్వహణలో జరుగుతున్న సాహిత్య గణపతి ఉత్సవాలలో ఆముక్తమాల్యద–ప్రకృతి వర్ణనలు అనే అంశంపై శనివారం ప్రసంగించారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, నరసింహమూర్తి, నారాయణమూర్తి, బాబూరావు, కామేశ్వరరావు, పి.శాంతమ్మ, ప్రభాకరరావు, పైడి హరనాధరావు, రామశర్మ పాల్గొన్నారు.

### మహనీయుల సేవలు అనుసరణీయం



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో శాంతి

రణస్థలం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మా గాంధీ వంటి మహనీయుల సేవలు అనుసరణీయమని రెవెన్యూ డివిజనల్ అధికారిణి బొడ్డేపల్లి శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, గాంధీ విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంతో మంది మహనీయుల త్యాగాలతో స్వాతంత్ర్య భారతావని ఏర్పడిందన్నారు. వారి అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### ఘనంగా విశ్వకర్మ అనుపోత్సవం



విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లివీధిలో విరాట్ విశ్వకర్మ భగవాన్ పంచరాత్రి పూజా మహోత్సవం శనివారంతో ముగిసింది. కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్వర్ణకార కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పట్నాన రామశంకరరావు, సాతివిల్లి కనకరాజు, సాతివిల్లి శ్రీనివాసరావు, తారకేశ్వరరావు, అనుపోజు శ్రీధర్ పాల్గొన్నారు.

### నారాయణ తిరుమలలో విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, వెంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామపారాయణలు జరిగాయి.

### క్రీడాపోటీల్లో ఎన్‌సీఎస్ విద్యార్థి ప్రతిభ



జె.చరణ్‌సూర్యకు బహుమతి అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీల్లో శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జె.చరణ్‌సూర్య ప్రతిభ కనబర్చాడు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో మొదటి బహుమతిని డీఈవో కె.వెంకటేశ్వరరావు చేతులమీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

### జీపీఎస్ వెనక్కు తీసుకోవాలి

శ్రీకాకుళం రూరల్: జీపీఎస్‌కు వ్యతిరేకంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎస్ రద్దు చేయకపోవడమే కాకుండా గ్యారెంటీ పెన్షన్ స్కీంతో ఉద్యోగ సంఘాలను మోసగిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కరిమి రాజేశ్వరరావు, ప్రతాప్, ఉమాశంకర్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వద్ద మొక్క నాటాలి



అరసవల్లి ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రతి ఇంటి వద్ద మొక్క నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక ముఖ్య కార్యదర్శి, కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానంలో పర్యాటక యువక్లబ్, రోటరీ క్లబ్ ద్వారా పట్టణంలో ఉన్న శర్వాణి విద్యా సంస్థకు చెందిన 50 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇంద్ర పుష్కరిణి వద్ద స్వచ్ఛభారత్ చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ మొక్కలతోనే సమస్త జీవకోటి ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో యువ క్లబ్ కో–ఆర్డినేటర్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గీతా శ్రీకాంత్, సామాజికవేత్త మంత్రి వెంకటస్వామి, యువజన శాఖ కార్య నిర్వహణ అధికారి బి.ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, ఇంటెక్ కన్వీనర్ రాధాప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర అకౌంటెంట్ డి.శ్రీనివాసరావు, సూర్యనారాయణస్వామి ఆలయ సూపరింటెండెంట్, పర్యాటక శాఖ అసిస్టెంట్ టూరిజం అధికారి డి.రమేష్, శర్వాణి విద్యాసంస్థ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల విధులపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ధనుంజయరావు

రణస్థలం: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల విధివిధానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.ధనుంజయరావు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఇంటర్న్ షిప్ చేస్తున్న విద్యార్థులకు సచివాలయాల విధులు, పౌరుల బాధ్యతలు, హక్కులపై ప్రత్యేక శిక్షణ కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. చదువును నిర్లక్ష్యం చేస్తే జీవితంలో విజయవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2 వంటి ఉద్యోగాలు సాధించేందుకు ప్రభుత్వ పరిపాలన, పాలన, ఉద్యోగుల కర్తవ్యంపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మణరావు, సచివాలయం ఉద్యోగులు లంక గణపతి, ఎ.శంకరరావు, 120 మంది విద్యార్థులు ఉన్నారు.

## యూజేఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ (యూజేఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ఎస్ వర్మ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా చౌదరి లక్ష్మణరావు, కార్యదర్శిగా పైడి రాము, ఉపాధ్యక్షునిగా డి.మహారణ, కోశాధికారిగా బి.అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా గొలివి నర్సునాయుడు, మొదలవలస వాసు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం యూజేఎఫ్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ఏపీ బీసీ అడ్వకేట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.ఉమామహేశ్వరరావు, యూజేఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కె.రాము, సమన్వయకర్త డి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.